వరుణదేవా.... కరుణించవా...



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భ్రమరాంభికాదేవి అమ్మవారు



కృష్ణవేణికి ప్రత్యేక పూజలు నిర్వహించి వరదపాశం సమర్పిస్తున్న జెట్టిపాలెం గ్రామస్తులు

కృష్ణవేణికి వరదపాశం సమర్పించిన జెట్టిపాలెం గ్రామస్తులు

సత్రశాల(రెంటచింతల): మండల పరిధిలోని సత్రశాల అతి ప్రాచీన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సమీపంలో పవిత్ర కృష్ణానది తీరాన వేంచేసిన కృష్ణవేణికి జెట్టిపాలెం గ్రామస్తులు సోమవారం వరుణదేవా... కరుణించవా అంటూ వరదపాశం సమర్పించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు ప్రతి రోజు ఆకాశం మేఘావృతమై ఉంటూ పంటలను సాగు చేసుకునేందుకు సరిపడ వర్షం పడకపోవడంతో జెట్టిపాలెం గ్రామస్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కృష్ణవేణికి వరదపాశం సమర్పించాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఆలయ ప్రధాన అర్చకులు చిట్టేలా మల్లికార్జునశర్మ నేతృత్వంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంభికాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సకాలంలో సంవృద్ధిగా వర్షాలు కురిసి పైరుపంటలు బాగా పండి రైతన్నల ఇంట సిరులు కురిపించి సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షతో మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



దాచేపల్లి: మండలంలోని గ్రామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో నాయకురాలు నాగమ్మ నిర్మించిన చెన్న మల్లికార్జున స్వామి దేవాలయంలో కళ్యాణ మండపం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. దాచేపల్లికి చెందిన చిట్టిప్రోలు ప్రసాదరావు కుమారులు(భవాని ఐరన్ స్టోర్) సూర్యం సోదరులు కల్యాణమండపం నిర్మాణానికి ముందుకొచ్చారు. ప్రత్యేకంగా పూజలు చేసిన తర్వాత కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణ దాతలను శాలువా పూల దండలతో కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జంగా వెంకట కోటయ్య, సర్పంచి జంగా సురేష్, నాయకులు తోట వెంకటేశ్వర్లు, పుల్లయ్య, జంగా సైదులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన విద్యార్థికి పరామర్శ




దాచేపల్లి: నారాయణపురం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో సీనియర్ విద్యార్థుల దాడిలో గాయపడిన జూనియర్ విద్యార్థిని రెవెన్యూ అధికారులు సోమవారం పరామర్శించారు. మండలంలోని శ్రీనగర్ గ్రామంలో నివాసం ఉంటున్న జూనియర్ విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శించి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. దాడిలో గాయపడిన జూనియర్ విద్యార్థికి మనో ధైర్యం చెప్పి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని అధికారులు హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో డెప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం, వీఆర్వోలు నాగేశ్వరరావు, రమేష్ ఉన్నారు.

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా పాపయ్య



కారెంపూడి: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు రెడ్డిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కడియం పాపయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు సోమవారం నియామక ఉత్తర్వులందాయి. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానానికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ కారెంపూడి పట్టణ ఉపాధ్యక్షుడుగా షేక్ మొహమ్మద్ నియమితులయ్యారు. ఆయనకు ఉపాధ్యక్ష పదవి కేటాయించడంపై పార్టీ మైనార్టీ విభాగం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కారెంపూడిలో భారీ వర్షం



కారెంపూడి: కారెంపూడిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం పడింది. సుమారు గంట పాటు కుండపోత కురిసింది. ఇటీవల కురిసిన వర్షాలతో భూమి బాగా తేమగా మారడంతో ప్రస్తుతం కురిసిన వర్షానికి పొలాలలో నీరు చేరింది. దీని వల్ల పత్తి పంటకు బాగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. చేలో పగిలిన పత్తిని తీసే మార్గం లేక పోవడంతో పాటు ఆ పత్తి తడిసి పాడయ్యే పరిస్థితి ఏర్పడింది. గులాబీ రంగు పురుగు ఉధృతి పెరుగుతందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

పేద విద్యార్థినికి చేయూత



కారెంపూడి: పేద విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు మండల అధికారులు సిబ్బంది పెద్ద మనసు చాటుకున్నారు. రూ.50 వేల ఆర్థిక సాయాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదగా సోమవారం విద్యార్థిని తండ్రి సాంబశివరావుకు అందజేశారు. సాంబశివరావు కుమార్తె బద్రి సౌమ్య పదో తరగతిలో మండల స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాంధించగా ప్రస్తుతం ఇంజినీరింగ్ చదువుతోంది. అయితే చదువుకు అయ్యే ఖర్చులు భరించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించారు. అదే స్ఫూర్తితో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఏఓ నరసింహారావు ఇతర మండల స్థాయి అధికారులు ఉద్యోగులు స్పందించి విద్యార్థిని చదువుకు చేయూతనందించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి

మాచవరం: ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఏఓలు కె.రావమ్మ, వెంకటేశ్వర్లు అన్నారు. వుండలంలోని కొత్తగణేశునిపాడు గ్రావు రైతు సేవా కేంద్రంలో పిడుగురాళ్ల, వూచవరం వుండలాల గ్రావు వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారులు వూట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన భూమి ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలియజేసారు. నేడు ఆహార పంటలపై అధికంగా రసాయన ఎరువులు వాడడం వలన తినే ఆహార పదార్థాలు విషపూరిత ఆహారంగా వూరి ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి కుటుంబ అవసరాలకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయంతో ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయ పంటలు సాగు చేపట్టాలని కోరారు. కార్యక్రవుంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది అప్పలరాజు, బాజీబాబు, సుబ్బారెడ్డి, హసీనా, యూనిట్ ఇన్‌ఛార్జిలు ఋసునీల్, జ్యోతి, రమేష్ పాల్గొన్నారు.

రాయితీపై విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలి

రెంటచింతల: మండల పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ సర్వీస్‌కు అధిక లోడ్‌ను 50 శాతం రాయితీపై క్రమబద్ధీకరించుకోవాలని ఏఈ షేక్ మస్తాన్‌వలి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అదనపు లోడ్ కోసం గృహ వినియోగదారులు ఒక కిలోవాట్‌కు రూ. 1,250, రెండు కిలోవాట్లకు రూ.2,450, మూడు కిలో వాట్లకు రూ.3,650, 4 కిలో వాట్‌కు రూ.4,850, 5 కిలోవాట్లకు రూ. 6,050 చెల్లించాల్సి ఉందని చెప్పారు. మీ సమీప ఎలక్ట్రికల్ రెవెన్యూ కార్యాలయంలో లేదా మీ సమీప ఈ–సేవా కేంద్రంలో ఏపీసీపీ డీసీఎల్ వెబ్‌సైట్‌లో మీకు కావాల్సిన అదనపు లోడ్‌కు(కిలోవాట్) తగిన చార్జీ చెల్లించి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. ఈ అవకాశం డిసెంబర్ 31వ తేదీ వరకు పెంచడం జరిగిందని చెప్పారు.

అండర్ -14 బ్యాడ్మింటన్‌కు ఎంపికైన గుడ్‌షఫర్డ్ విద్యార్థి



వినుకొండ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ కోచింగ్ సెంటర్, యానంలో నిర్వహించిన అండర్-14 బ్యాడ్మింటన్ సెలక్షన్‌లో పట్టణంలోని గుడ్‌షఫర్డ్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కోట కమల్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గోపు ఇన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపు బాలిరెడ్డి ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటూ నేషనల్ స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కమల్ కోచింగ్ నిమిత్తం యానం వెళ్తున్నాడని, ఇక అక్కడే ఐదు సంవత్సరాలు ఉచితంగా విద్యతో పాటు, ఉచిత బ్యాడ్మింటన్ కోచింగ్ ఇస్తూ నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడేందుకు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థిని పలువురు అభినందించారు.

క్రీడా దినోత్సవ పోటీలకు మున్సిపల్ విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్, క్రీడా పోటీలలో బరంపేటలోని కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని జిల్లా జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తావుర్యా సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు వాలీబాల్ మహిళా విభాగానికి పి.ప్రణతి, షేక్.షహనాజ్, పి.జాహ్నవి, వై.స్తోత్రాంజలి, ఎస్.త్రివేణి, కబడ్డీలో షేక్.అయేషా, బాట్మింటన్ పురుషుల విభాగంలో డి.వేదసాయి కార్తీక్ ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 19, 20 తేదీలలో ఏఎన్‌యూ క్రీడా మైదానంలో నిర్వహించనున్న జోన్ 3 స్థాయి పోటీలలో తమ విద్యార్థులు పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఇజ్రాయేల్ ప్రసాదు, డి.గంగమ్మ అభినందించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలో ఢిల్లీ స్కూల్ ద్వితీయ స్థానం



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు పాఠశాల చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు సోమవారం తెలిపారు. అమరావతిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 10వ తేదీన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ ఓపెన్, గర్ల్స్ చెస్ టోర్నమెంట్-2025 పోటీలో తమ పాఠశాల విద్యార్థులు ఏకాగ్రత, వ్యూహం, పట్టుదలతో ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. విద్యార్థులు కృషి, క్రమశిక్షణతో విద్యా, క్రీడా రంగాలలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ నాగోతు సబితా, ప్రిన్సిపల్ రేఖా పూలేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓబీసీ వర్గాల ఐకాన్‌గా మోదీ నిలుస్తారు

నరసరావుపేట రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓబీసీ వర్గాల ఐకాన్‌గా, ఆరాధ్య నాయకుడిగా నిలిచిపోతారని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ ప్రక్రియలో దళితుల గుండెల్లో ఆరాధ్య దైవంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిలిచారని, అంబేద్కర్ స్ఫూర్తితో ఓబీసీ వర్గాల ఆరాధ్య నాయకుడిగా నరేంద్రమోదీ నిలిచిపోనున్నారని తెలిపారు. దేశంలో విప్లవాత్మక మార్పుల దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేయబోతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, సుతారం విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

వినుకొండ: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి గ్రామసమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వినుకొండ రూరల్ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన మొగిలి ఆంజనేయులు (24) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. ఆంజనేయులు మృతికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కలహాల నేపథ్యంలో భర్త ఆత్మహత్య

యడ్లపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన వల్లెపు రాజేష్ (24) కోళ్ల ఫారంలో కూలీగా పనిచేసేవాడు. గత కొంతకాలంగా అతని భార్య సంగీతతో మనస్పర్థలు నెలకొన్నాయి. ఈ భేదాభిప్రాయాలు పెరిగి పెద్దవి కావడంతో రాజేష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రాజు శనివారం రాత్రి క్షణికావేశంలో తన ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తలుపులు పగలగొట్టి అతడిని కిందకి దించారు. కానీ అప్పటికే రాజేష్ ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ టి.శివరామకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

మృతదేహం అప్పగింత



కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

యడ్లపాడు: స్థానిక కారుచోల రోడ్డులో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో బైక్, స్కూటీలు ఎదురెదురుగా ఢీకొనగా ముగ్గురికీ గాయాలు కాగా, వీరిలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారుచోల గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ నల్లజర్ల రామకోటేశ్వరరావు (36) పనివేతనం కోసం బైక్‌పై యడ్లపాడు బయలుదేరగా, అదేసమయంలో యడ్లపాడు నుంచి నూలుమిల్లు వద్దకు స్కూటీపై వస్తున్న ఒరిస్సా వాసి మిథున్ మాలిక్ దంపతులు వస్తుండగా రెండు వాహనాలు యడ్లపాడు దిగువ ఎస్సీకాలనీ శ్మశానం వద్ద ఢీకొన్నాయి. వాహనాలు దెబ్బతినడంతో పాటు ముగ్గురికీ గాయాలయ్యాయి. తలకు తీవ్రగాయమైన రామకోటేశ్వరరావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అనంతరం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించుకున్నారు.

యడ్లపాడులో విషాదం



హృదయరాణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

యడ్లపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో క్లాప్‌మిత్ర బలవన్మరణం చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... యడ్లపాడు దిగువ ఎస్సీ కాలనీకు చెందిన హృదయరాణి (35) వివాహం తర్వాత దంపతులు, ఇద్దరు పిల్లలతో కలిసి స్వగ్రామమైన యడ్లపాడులోనే నివాసం ఉంటుంది. కొద్దికాలంగా దంపతుల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. 2018 నుంచి యడ్లపాడు పంచాయతీ కార్యాలయం పరిధిలో క్లాప్‌మిత్రగా పనిచేస్తోంది. సోమవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. హృదయరాణి ఆత్మహత్యకు గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. సమాచారం అందుకున్న వెంటనే యడ్లపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

రేపు రైతు వ్యతిరేక విధానాలపై నిరసన



వినుకొండ: సంయుక్త రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపులో భాగంగా బుధవారం జిల్లాలోని అన్ని మండలాల్లో ట్రంప్, మోదీల రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా వారి దిష్టిబొమ్మలు దహనం చేయాలని పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. స్థానిక శివయ్యభవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రంప్ మన దేశంపైన విధించిన 50 శాతం సుంకాలను వెనక్కి తీసుకోవాలని, మోదీ వెంటనే డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని, వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు బాలస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, రామయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక జాతీయ గౌరవ అధ్యక్షురాలిగా డాక్టర్ శాంతిబాయి



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్‌సాంబేలు శాంతిబాయి, కె.ప్రతాప్ తదితరులు

మాచర్ల: అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక సంస్థ జాతీయ గౌరవ మహిళ అధ్యక్షురాలిగా డాక్టర్ సాంబేలు శాంతి బాయిని నియమిస్తూ సంస్థ సీఈఓ కత్తిమండ ప్రతాప్ నియామకపత్రం సోమవారం అందజేశారు. డాక్టర్ సాంబేలు శాంతి బాయి విద్య, సేవ, సాహిత్య, కళా రంగాల్లో ప్రతిభను ఉన్న మంచి మనిషికి మరొక ఉన్నతి కలగడం సంతోషమని వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ సభ్యుడు ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు దినోత్సవం సందర్భంగా ఆగస్టు 31న నరసరావుపేటలో నిర్వహించనున్న తెలుగు తేజం కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సిపల్లి హారిక, ఈశ్వరి భూషణం, లలిత, పార్థసారథి, బాలార్జున, సుశీల పాల్గొన్నారు.

వరి సాగులో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టండి

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారెంపూడి: వరి సాగులో పెట్టుబడులు తగ్గించుకునే విధంగా రైతులు ఆలోచించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై వరి, కంది విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. వరి బీపీటీ 5204 రకం, కంది సౌభాగ్య ఎల్ఆర్‌జీ 133–33 రకం విత్తన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు రైతులు ఎంతో కష్టించి పని చేసే తత్వం ఉన్నా కాని అందివస్తున్న నూతన సాగు పద్ధతులను అందిపుచ్చుకోవడంలో జాప్యం జరుగుతోందని వివరించారు. పశ్చిమ బెంగాల్ రైతులు వరి సాగుతో చాలా కాలంగా అధిక దిగుబడులు మన కంటే తక్కువ పెట్టుబడి ఖర్చులతో సాధిస్తున్నారన్నారు. సంప్రదాయ సాగు వలన మన రైతుల పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని సాలు పద్ధతిలో బెంగాల్ నాటు విధానంలో మన రైతులు కూడా నాట్లు వేయాలని కోరారు. ఇప్పటికే చాలా మంది రైతులు ఇది గమనించి ఆ రాష్ట్రం నుంచి కూలీలను పల్నాడు జిల్లాకు గత రెండేళ్లుగా రప్పించి నాట్లు వేయిస్తున్నారని అలా చేసిన వారు దిగుబడులు అధికంగా సాధిస్తున్న విషయాన్ని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.

జాతీయోద్యమ స్ఫూర్తి అవసరం



జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

పిడుగురాళ్ల: ప్రతి ఒక్కరూ జాతీయోద్యమ స్ఫూర్తితో నడవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపాలాడాలని అకాంక్షించారు. కులమతాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటే అనే నినాదంతో మన మూడు రంగుల జాతీయ జెండాను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు జాతీయ భావంతో కలిసిమెలిసి ఐక్యమత్యంగా ఉండాలన్నారు. నేటి సమాజంలో ఐక్యమత్యం కొరవడుతుందని, ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం జాతీయ జెండాలతో మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పట్టణంలోని ఐలాండ్ సెంటర్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు

దేశ భక్తి కలిగిఉండాలి

గురజాల: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగిఉండాలని నగర పంచాయతీ చైర్మన్ షేక్ బడే జానీ అన్నారు. ఆగస్టు 15ను పురస్కరించుకుని పట్టణంలో నగర పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు జాతీయ జెండాలను చేతబట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నెలవల్లి బుల్లయ్య, టీడీపీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, శరమాళ్ళ హనుమంతరావు, కమీషనర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో రిజిస్టరు తనిఖీ చేస్తున్న ఏడీఏ హనుమంతరావు

ఈపూరు(శావల్యాపురం): ఎరువులు బ్లాక్ మార్కెట్ కాకుండా ముందుస్తుగా అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తున్నట్లు డీడీఏ కార్యాలయ ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం ఈపూరు మండలం ఈపూరు, కొండ్రముట్ల, ముప్పాళ్ళ గ్రామాల్లో ఎరువుల విత్తనాల దుకాణాలను వ్యవసాయ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు ఎరువుల విత్తనాల దుకాణాలు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణాల్లో ఎలాంటి బయోమెక్ ప్రొడక్టు నిల్వలు లేవన్నారు.స్టాకు రిజిష్టర్లు బిల్ పుస్తకాలు గోడౌన్‌ల్లో ఉన్ననటువంటి స్టాకును పరిశీలించారు.ఓఫామ్ ఉండి లైసెన్సులో ఇంక్యూషన్ చేసుకోనందున 9 టన్నుల ఎరువులను అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఎరువులు పురుగు మందులు అమ్మకాలు చేసిన దుకాణాదారులు సంబదింత రైతుకు తప్పనిసరిగా రసీదు బిల్లును ఇవ్వాలన్నారు, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపిన దుకాణాల లైసెన్సులు రద్దు చేసి అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాలపై వరుసదాడులు

బొల్లాపలి: రేషన్ షాపులపై రెవెన్యూ అధికారులు వరుసదాడులు చేస్తున్నారు. చేపట్టారు. తాజాగా సోమవారం మండలంలోని పేరూరుపాడు, వెల్లటూరు, గరికపాడు, జయంతి రామపురం, తదితర గ్రామాల్లోని రేషన్ షాపుల పై సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వైఎస్సార్ సానుభూతి పరులకు చెందిన చౌకధరల దుకాణాలపై దాడులు చేస్తున్నారని ఆరోపణలు పది రోజుల వ్యవధి లో దాడులు జరగటం మూడోసారి పల్నాడు జిల్లా పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్‌లు, సీఎస్‌డీటీతోపాటు పలువురు తనిఖీల్లో పాల్గొన్నారు.

గ్రంథాలయ పునః నిర్మాణం అభినందనీయం

చిలకలూరిపేట: గ్రంథాలయాన్ని సొంత నిధులతో అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి గ్రంథాలయాన్ని రూ. 16 లక్షలతో పునఃనిర్మాణం చేయగా, సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 90 ఏళ్ల నాడు ప్రజలకు విజ్ఞానం పెంచేలా నిర్మించిన గ్రంథాలయాన్ని వాసవి కన్యకాపరమేశ్వరీ ధర్మసంఘం సభ్యులు పునః నిర్మాణం చేయడం ఆదర్శనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం నింపేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలుత గ్రంథాలయ భవనంలో ఏర్పాటు చేసిన మహాత్మగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించి, గ్రంథాలయాన్ని పునః ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం సాంబశివరావు, అధ్యక్షుడు పసుమర్తి వెంకట సూర్య ప్రకాశరావు, కార్యదర్శి చేబ్రోలు శ్రీనివాసరావు, కోశాధికారి రాచుమల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.